సాక్షి
రంగారెడ్డి

గురువారం । 17 । అక్టోబర్ । 2024



జెర్బరా సాగుతో లాభాలు

పాలీహౌస్‌లో జెర్బరా సాగు లాభాలు కురిపిస్తున్నాయి. మూడు నెలలు కష్టపడితే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. 8లో▸



ఆధ్యాత్మిక చింతనతో..

ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే శంకర్ అన్నారు. 8లో▸



'మల్టీపర్పస్' రద్దు చేయాలి

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

కేశంపేట వాసికి జాతీయ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జంగయ్య

కేశంపేట: ఇంటర్నేషనల్ వైట్ కేన్ సేఫ్టీ దినోత్సవం సందర్భంగా పలువురికి అవార్డులు అందజేశారు. గ్రామానికి చెందిన పోలేపోగు జంగయ్య ఆర్టిస్టు విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన వైట్ కేన్ సేఫ్టీ సంబురాల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జంగయ్యకు దివ్యాంగుల కోటాలో అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టె గ్రామ కార్యదర్శి సహా నందిగామ మండలం చేగూర్ పంచాయతీ కార్యదర్శుల కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం, విధి నిర్వహణలో అలసత్వం వంటి కారణాలపై ఆయా అధికారులపై చర్యలు తీసుకున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ తెలిపారు.

ఏఓవీఎస్‌కు 29వరకు గడువు

తుక్కుగూడ: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి (ఏఓవీఎస్) పథకానికి 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 29వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జె.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విదేశీ వర్సిటీల్లో చదువుతున్న షెడ్యూల్ కులాల నుంచి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్‌శాఖ షాబాద్ ఏఈగా కోటేశ్వర్‌రావు



షాబాద్: విద్యుత్‌శాఖ మండల ఏఈగా కోటేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ నరేందర్‌నాయక్ అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి బదిలీపై వెళ్లారు. బంజారాహిల్స్‌లో పనిచేస్తున్న కోటేశ్వర్‌రావు బదిలీపై షాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పాండు



నియామకపత్రం అందుకుంటున్న పాండు

కందుకూరు: ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తిమ్మాపూర్‌కు చెందిన మంద పాండు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగారెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

తాటి, ఈత చెట్లు నరికితే చర్యలు

ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్

ఆమనగల్లు: అనుమతి లేకుండా తాటి, ఈత, ఖర్జూర చెట్లను నరికితే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో బుధవారం సీఐ బద్యానాద్‌చౌహాన్ విలేకరులతో మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలలో ఇటీవల కొన్ని వెంచర్లలో అనుమతిలేకుండా తాటి, ఈత చెట్లను నరికినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తాటి, ఈత చెట్లను నరికినట్లయితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని లేదా ఫొటోలు, వీడియోలు తమకు వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు. గీత కార్మికులు కల్లులో మత్తుపదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వాహాకారం!

చేయి తడిపితేనే లోన్లు

- రైతులను ఇబ్బంది పెడుతున్న సహకార బ్యాంకులు
- పీఏసీఎస్‌లలో అధికారుల చేతివాటంపై సర్వత్రా విమర్శలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: సహకార బ్యాంకుల్లో 'స్వాహా'ల పర్వం కొనసాగుతోంది. రైతులకు అండగా ఉండాల్సిన అధికారులు.. పాలక మండలి సభ్యులు.. వారి పాలిట జలగల్లా తయారయ్యారు. రుణమాఫీ, పంటలోన్ల కోసం బ్యాంకులను ఆశ్రయించే రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. చేయి తడపనిదే పని కావడం లేదు. దీంతో మెజార్టీ రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకుల నుంచి అప్పు తీసుకోవాలంటేనే జంకుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్షియర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు ఏర్పాటు చేసిన ఈ సహకార బ్యాంకులు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోగా.. రూ.కోట్లలో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే మంచాల, యాచారం పీఏసీఎస్‌లో భారీగా నిధుల గోల్‌మాల్ జరిగిన విషయం విదితమే. తాజాగా కందుకూరు సొసైటీలోనూ అక్రమాలు వెలుగు చూడడంతో బ్రాంచ్ మేనేజర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

ఐదు శాతం కమీషన్‌తో ఫైల్ ప్రాసెస్

జిల్లా వ్యాప్తంగా 37 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుండగా.. వీటిలో 1,66,105 మంది సభ్యులు ఉన్నారు. రూ.3,749 కోట్ల రుణాలు మంజూరు చేశారు. కందుకూరులో అత్యధికంగా 12,997 మంది సభ్యులు ఉండగా బాటసింగారంలో 11,508 మంది, షాబాద్‌లో 10,943 మంది, తలకొండపల్లిలో 10,331 మంది సభ్యులున్నారు. మిగతా పీఏసీఎస్‌లలో ఐదు నుంచి ఏడు వేల మంది వరకు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఈ బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తుంటాయి. దీర్ఘకాలిక రుణాల కింద పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు, గొర్రెలు, మేకల పెంపకం కోసం.. స్వల్ప కాలికం కింద పంట పెట్టుబడులకు.. జీవనోపాధి కల్పనకు చిరువ్యాపారులకు బంగారం తాకట్టు కింద రుణాలను అందజేస్తుంది. పశువులకు ఇన్సూరెన్స్ సౌకర్యం సైతం కల్పిస్తుంది. రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను బ్యాంకుల్లో కుదువ పెట్టి.. అప్పులు తీసుకుంటుంటారు. ఈ లోన్ల మంజూరు విషయంలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫైలు కదలాలంటే ముందుగానే ఐదుశాతం కమీషన్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కందుకూరు పీఏసీఎస్‌లో ఇటీవల ఇదే అంశంపై అధికారులు, పాలకవర్గం సభ్యుల మధ్య వివాదం తలెత్తి ఉన్నతాధికారులకు, డీసీసీబీ చైర్మన్‌కు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఇప్పటికే బ్యాంకు బ్రాంచి మేనేజర్‌పై వేటు వేసినట్లు తెలిసింది.

అనాలోచిత నిర్ణయాలతో నష్టాలు

మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, తదితర పీఏసీఎస్‌లలో ఇష్టారాజ్యంగా లోన్లు మంజూరు చేశారు. గతంలో పాలక మండలి సభ్యులు, అధికారులు కుమ్మక్కై బ్యాంకులను లూటీ చేశారు. క్షేత్రస్థాయిలో భూమి లేని రైతులకు సైతం అడ్డగోలుగా రుణాలు మంజూరు చేయడంతో బకాయిలు పేరుకుపోయాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలు బ్యాంకులకు నష్టాలను తెచ్చిపెడుతున్నాయి. అవసరం లేక పోయినా నాబార్డు నుంచి రుణం తీసుకుని కందుకూరు, నేదునూరు, రాచలూరులో గోదాంలు నిర్మిస్తున్నారు. జిల్లాలో పంట సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజీ కేంద్రాల అవసరమే ఎక్కువ. నాటి అధికారులు, పాలకమండలి సభ్యులు రైతుల అవసరాలకు భిన్నంగా ఆలోచన చేయడంతో బ్యాంకులు నష్టపోవాల్సి వస్తోంది.

రుణమాఫీని వదలని వైనం

- నాగిళ్ల జంగయ్య లోను కోసం దరఖాస్తు చేసి ఏడాది గడిచింది. తొలుత ఒరిజినల్ పాసుబుక్ లేదని లోను నిరాకరించారు. ఆ తర్వాత ఆయన ఒరిజినల్ పాసుబుక్ సమర్పించినప్పటికీ మంజూరు కాలేదు. అదేమంటే లోను ఇవ్వాలంటే ముందు ఐదుశాతం కమీషన్ చెల్లించాలని స్పష్టం చేశారు. కమీషన్ ఇచ్చేందుకు ఇష్టపడని ఆయన ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాల్సి వచ్చింది.
- ముచ్చర్లకు చెందిన సింగం బాలరాజు ఆధార్ మిస్ మ్యాచ్ అయిందని రుణమాఫీ చేయలేదు. అధికారులను ఆశ్రయిస్తే..పని కావాలంటే ముందు తమకు కొంత మొత్తం ముట్టజెప్పాలని చెప్పడం విశేషం.
- రాచలూరుకు చెందిన చిట్ట సత్తయ్యకు రూ.90 వేల లోను మాఫీ అయిందని అధికారులు చెప్పారు. ఆ తర్వాత కాలేదు అంటున్నారు.
- జెడ్పీటీసీ మాజీ సభ్యుడికి బీమా విషయంలోనూ ఇదే అనుభవం ఎదురైంది.
- బ్యాంకులో లోను తీసుకున్న ఓ రైతుకు లోన్ క్లియర్ చేయకుండానే కుదువ పెట్టిన పాసుపుస్తకాలు అప్పగించడంపై సైతం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

విచారణ జరుగుతోంది

కందుకూరు పీఏసీఎస్‌లో అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. నలుగురు సభ్యులతో విచారణ కమిటీ వేశాం. రెండు రోజుల్లో తుది నివేదిక వస్తుంది. రుణమాఫీ, రుణాల మంజూరు పేరుతో రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన సిబ్బందిని వదిలే ప్రసక్తే లేదు.

– కొత్తకుర్మ సత్తయ్య, చైర్మన్, డీసీసీబీ



కేఎల్ఐ కాలువలో పారుతున్న కృష్ణా జలాలు

కేఎల్ఐలో కృష్ణా జలాలు

హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) డీ–82 కాల్వ నుంచి కృష్ణా జలాలు పారుతుండంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కేఎల్ఐ పథకంలో భాగంగా ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాల పరిధిలో దాదాపు 37వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు డీ–82 కాల్వ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితమే అనుమతులిచ్చింది. ఇందుకు రూ.178 కోట్లు నిధులు మంజూరు చేసింది. కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి నుంచి వెల్దండ, ఆమనల్లు మాడ్గుల మండలంలోని నాగిళ్ల వరకు కాల్వ నిర్మాణం చేపట్టారు. ఆమనగల్లు మండలంలో పోలెపల్లి, సింగంపల్లి పరిధిలో ఎనిమిది కిలోమీటర్లు, మాడ్గుల మండలం అవురుపల్లి, దొడ్లపహాడ్, అప్పారెడ్డిపల్లి, నాగిళ్ల వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయినప్పటికీ నాలుగేళ్లుగా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎమ్మెల్సీగా ఉండి కాలువ నిర్మాణానికి కృషి చేసిన కసిరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ప్రత్యేక శ్రద్ధతో కాలువ నిర్మాణం పూర్తి చేయించారు. నెలరోజుల క్రితం ఆయన ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి అసంపూర్తి పనులను పరిశీలించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సాగునీరును విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆమనగల్లు మండలంలో రెండుచోట్ల అసంపూర్తి పనులు పూర్తయితే మాడ్గుల మండలంలోని నాగిళ్ల వరకు కృష్ణజలాలు చేరుతాయి.

రోడ్ల నిర్మాణానికి రూ.7.50కోట్ల నిధులు

మంత్రి సీతక్కకు ఎంపీ కొండా ధన్యవాదాలు

చేవెళ్ల: చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో రెండు రోడ్ల నిర్మాణానికి పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.7.50కోట్ల నిధులు విడుదలైనట్లు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఆగస్టులో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కోరానని గుర్తు చేశారు. నిధులు విడుదల చేసిన మంత్రి సీతక్కకు ఆయన నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పంచాయతీరాజ్ శాఖ జీఓ నంబర్ 582 ద్వారా చేవెళ్ల నుంచి ముడిమ్యాల వయా మల్కాపూర్ మీదుగా 3.28 కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.35 కోట్లు, మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ ఎన్టీఆర్ మోడల్ స్కూల్ నుంచి గండిపేట్ వరకు 2.50కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.4.15కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు.



కాటమయ్య రక్షణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

గీత కార్మికుల రక్షణకు..

కాటమయ్య రక్షణ కవచాలు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: గీత కార్మికుల రక్షణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాలు(కిట్లు) ఉచితంగా పంపిణీ చేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతితో కలిసి గీతకార్మికులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గీత కార్మికుల రక్షణకు ప్రతీ నియోజకవర్గంలో 400 మందికి ప్రభుత్వం ఈ కిట్లు పంపిణీ చేస్తోందన్నారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఈత, తాటి చెట్లను పెంచేందుకు సర్కార్ యోచిస్తోందన్నారు. ప్రతీ గీత కార్మికుడికి గుర్తింపు కార్డుతో పాటుగా 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్లు అందజేస్తామన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

గంజాయిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మహమ్మారిని తరిమేసేందుకు ప్రజా సహకారమే ప్రధానం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీపతిగౌడ్, ఈసీ శేఖర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, బీసీ సంక్షేమశాఖ, అబ్కారీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో చిరుత

వికారాబాద్ జిల్లా రేళ్లగడ్డతండాలో కోడెదూడపై దాడి

- పాదముద్రలు సేకరించిన ఫారెస్ట్ అధికారులు
- దాడి చేసింది చిరుతపులేనని నిర్ధారణ





ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి, (ఇన్‌సెట్‌లో) చిరుత పాదముద్రలు

యాలాల: వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని రేళ్లగడ్డతండాలో చిరుతపులి సంచారం కలకలం రేపింది. పశువుల పాకలో కట్టేసిన ఓ కోడెపై దాడి చేసి చంపింది. సమీప పొలాల్లో పాదముద్రల ఆధారంగా దాడికి పాల్పడింది చిరుతనేనని ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరించారు. బుధవారం ఉదయం ఈ ఘటన వెలుగు చూడగా సమీప ప్రాంతాల రైతులు, తండావాసులు భయాందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రేళ్లగడ్డతండాకు చెందిన సక్రీబాయి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన పశువులను పొలం సమీపంలోని పాకలో కట్టేసి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయాన్నే వెళ్లి చూడగా ఓ కోడె దూడ చనిపోయి ఉండటాన్ని గమనించి, స్థానికులకు సమాచారం ఇచ్చింది. దూడ కడుపు, వెనక భాగంలో జంతువులు దాడి చేసి, తిన్నట్లు గమనించి వెంటనే అటవీశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎఫ్ఆర్ఓ రాజేందర్, యాలాల ఎస్ఐ శంకర్ ఆధారాలు సేకరించారు. దూడపై దాడి చేసిన ప్రదేశంతో పాటు పొలాల్లో పాదముద్రలను గుర్తించారు. వీటి ఆధారంగా దాడికి పాల్పడింది చిరుతే అని అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో రేళ్లగడ్డతండా, పటేల్‌చింతతండా, పగిడిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

పరిహారం అందేలా చూస్తాం

చిరుత దాడిలో దూడ మృతిచెంది, నష్టపోయిన రైతు సక్రీబాయికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని ఎఫ్ఆర్ఓ రాజేందర్ తెలిపారు. అటవీ ప్రాంతంలోకి పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు ఒంటరిగా ఉండకూడదని సూచించారు. పొలాల వద్ద పనులు చేసుకునే సమయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళ పశువుల పాకల సమీపంలో మంట పెట్టాలని తెలిపారు. రేళ్లగడ్డతండాలో చిరుత సంచరిస్తుందనే సమాచారం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలోనూ ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. తిమ్మాయిపల్లి సెక్షన్ పరిధిలోని రిజర్వ్ ఫారెస్టు ఉండటం, కొండలు, గుట్టలతో దట్టమైన అడవి కారణంగానే చిరుత సంచారం వెలుగు చూసినట్లు అధికారులు చెబుతున్నారు. చిరుత ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శంకర్ రైతులకు సూచించారు. రాత్రి వేళ ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లకూడదని తెలిపారు.

పెళ్లి కోసం తల్లితో గొడవ

- ప్రేమించిన యువకుడి ఇంట్లో బాలిక తిష్ట
- పోలీసులకు ఫిర్యాదు.. సఖి సెంటర్‌కు తరలింపు

బషీరాబాద్: పదహారేళ్ల బాలిక తాను ప్రేమించిన యువకుడితో వివాహం చేయాలని తల్లితో గొడవకు దిగింది. ఇప్పుడే పెళ్లి ఏంటని తల్లి మందలించడంతో.. నేరుగా తాను ఇష్టపడ్డ యువకుడి ఇంటికి వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బషీరాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఎనిమిదో తరగతి చదివి, ప్రస్తుతం టైలరింగ్ చేస్తోంది. ఇదే ఊరికి చెందిన ప్రశాంత్(21) అనే యువకుడితో ప్రేమలో పడింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని సదరు బాలిక గత మంగళవారం తల్లి లక్ష్మికి తెలియజేసింది. దీంతో 'తండ్రిలేని బిడ్డవు.. ఇంకా నీకు పెళ్లి వయసు రాలేదు.. కొంత కాలం ఆగు బిడ్డా' అని సముదాయించింది. ఇది నచ్చని బాలిక తల్లితో వాగ్వాదానికి దిగింది. నువ్వు చేయకపోతే నేనే చేసుకుంటా అని చెప్పి ప్రశాంత్ ఇంటికి వెళ్లింది. ఈ ఘటనతో అబ్బాయి కుటుంబ సభ్యులు సైతం నిర్ఘాంతపోయారు. బాలిక తల్లి చైల్డ్‌లైన్ 1098కు కాల్ చేసి జరిగిన విషయం చెప్పింది. బుధవారం ఉదయం బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన కూతురు పెళ్లిని అడ్డుకోవాలని కోరింది. తన బిడ్డను మందలిస్తే ప్రశాంత్ తనను బెదిరించాడని ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం లీగల్ అధికారి నరేష్, ఎస్ఐ గఫార్ సిబ్బందితో యువకుడి ఇంటికి వెళ్లి విచారణ జరిపారు. అనంతరం పోలీసులు ప్రశాంత్‌ను పీఎస్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహం చెల్లదని, చట్టప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. పద్దెనిమిదేళ్లు ఏళ్లు నిండిన తర్వాత అదే యువకుడితో పెళ్లి చేస్తామని బాలికకు భరోసా ఇచ్చారు. అప్పటి వరకు చదువుకోవాలని వికారాబాద్‌లోని సఖి కేంద్రానికి తరలించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వంద శాతం సీట్లు గెలుస్తాం

మహేష్‌కుమార్ గౌడ్

సాక్షి సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వంద శాతం సీట్లు గెలుస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. హైడ్రాపై ప్రజలకు అన్ని వాస్తవాలు తెలుసన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న నేతల పేర్లు త్వరలో బయటపెడుతామన్నారు. మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు తమ స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య. చిత్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, మేయర్ పారిజాత తదితరులు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం
- హాజరైన స్పీకర్, మంత్రి, ఎమ్మెల్యేలు

బడంగ్‌పేట్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, బుయ్యని మనోహర్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. గ్రంథాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని వారు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్లు, మండలాలు, గ్రామాల్లోని గ్రంథాలయాలను బలోపేతం చేసి విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా చూడాలని చైర్మన్‌కు సూచించారు. అనంతరం స్పీకర్ ప్రసాద్, ఎమ్మెల్యేలు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, కమిషనర్ రఘు తదితరులు ఉన్నారు.

పైసలిస్తేనే మెమో, టీసీ!

కుల్కచర్ల: అందరికీ ఆదర్శంగా నిలవాల్సిన ఆశ్రమ పాఠశాల వివాదాస్పదంగా మారింది. వివరాలు .. చౌడాపూర్ మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో.. 2023– 24 బ్యాచ్‌కు చెందిన 43 మంది విద్యార్థులు టెన్త్ పాసయ్యారు. వీరిలో కొంతమంది బుధవారం మెమోలు తీసుకునేందుకు స్కూల్‌కు వచ్చారు. అయితే ఒక్కొక్కరి నుంచి రూ.200 నుంచి రూ.500 తీసుకుని మెమో, టీసీ ఇచ్చిన సిబ్బంది.. డబ్బులు లేని వారికి ఇవ్వలేదు. మిడ్జిల్ మండలానికి చెందిన అరుణ్, శివ ఒరిజినల్ టీసీ, మెమో కోసం పాఠశాలకు వచ్చారు. ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేయడంతో రూ.200 చొప్పున ఇచ్చి తీసుకెళ్లాలని సూచించారు. డబ్బులు లేవని చెప్పినా.. ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని సార్ వాళ్లు చెప్పారు. ఈ సమాచారాన్ని మా పేరెంట్స్‌కు చేరవేశాం. వారు గురువారం వస్తామనడంతో రాత్రి ఇక్కడే పడుకుంటున్నాం అన్నారు. ఇదే విషయమై డీటీడబ్ల్యూఓ కమలాకర్‌రెడ్డిని ప్రశ్నించగా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వద్ద ఒక్క రూపాయి కూడా తీసుకోవడానికి వీల్లేదు. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు: ఆధ్యాత్మికత చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన నందిగామ మండల కేంద్రంలో గ్రామ దేవతల విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దైవ చింతనతో ఇతరులపట్ల ప్రేమానురాగాలతో మెలుగుతారన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చెత్త పారబోసిన వ్యక్తికి జరిమానా



బహిరంగ ప్రదేశంలో చెత్త వేసిన వ్యక్తికి జరిమానా రసీదు ఇస్తున్న అధికారులు

బడంగ్‌పేట్: స్వచ్ఛ సర్వేక్షన్‌కు ప్రజలు సహకరించాలని కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు ప్రచారం చేసినా ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారికి జరిమానా విధించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి నేతృత్వంలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్‌లో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారబోస్తున్న వ్యక్తిని పట్టుకుని రూ.5వేల జరిమానా విధిస్తూ రసీదును అందజేశారు. మరోమారు బహిరంగ ప్రదేశంలో చెత్త వేస్తే రూ.10వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ శ్రీమతి దూపాటి లక్ష్మీ నర్సమ్మ భర్త డి.రఘునాగ రాజు, వయస్సు 48 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ఇం.నం.5-4, భట్టుగూడెం గ్రామం, చింతపల్లి మండలం, నల్గొండ జిల్లా, తెలంగాణ వారు శ్రీ తిప్పలూరి నాగార్జున రెడ్డి తండ్రి టి. బాలనాగి రెడ్డి, వయస్సు 58 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇం.నం. 1-98/7/1, ప్లాట్ నం. 24, గణేష్ నగర్ కాలనీ, రాగన్నగూడ గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా వారితో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని, తెలంగాణ, ఆర్.ఆర్.జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, తుర్కయంజాల్ గ్రామం, S.G.R టౌన్‌షిప్ వద్ద గల సర్వే నం. 294 మరియు 288లోని, ఆర్.సి.సి రూఫ్‌తో గ్రౌండ్ ఫ్లోర్‌లో 504 చ.అడుగులు మరియు మొదటి అంతస్తు 504 చ.అడుగులు, 1008 చ.అడుగుల మొత్తం ప్లింత్ ఏరియా కలిగిన, 100 చ.గజాలు లేదా 83.6 చ.మీటర్ల విస్తీర్ణపు ప్లాట్ నం. 24 దక్షిణ భాగం, (PTIN No. 1200700184) లో ఇం.నం. 1-98/7/1, గల నివాసిత ఇల్లు, సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నం. 24N/p, దక్షిణం: ప్లాట్ నం.23, తూర్పు: 30" వెడల్పు రోడ్, పశ్చిమం: ప్లాట్ నం. 7 గల దానికి సంబంధించి తగిన అడ్వాన్స్ అమ్మక ప్రతిఫలం చెల్లించి, 05-10-2024న అమ్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కావున, పైన పేర్కొన్న ఆస్తిలో ఏదైనా క్లెయిమ్, హక్కు లేదా ప్రయోజనం కలిగిన ఎవరైనా వ్యక్తి/వ్యక్తులు, సంబంధిత డాక్యుమెంటరీ రుజువుతో నేటి నుండి ఏడు (7) రోజుల్లోగా దిగువ సంతకందారును సంప్రదించవచ్చు. ఎటువంటి క్లెయిమ్ లేనిచో, తదుపరి నా క్లయింట్ మిగతా మొత్తం అమ్మక ప్రతిఫలం చెల్లించి అతని పేరున గాని లేదా అతనిచే నిర్దేశించబడిన వారి పేర్ల మీదగాని నమోదిత సేల్ డీడ్ అమలు చేయుట ద్వారా అట్టి లావాదేవి పూర్తి చేసుకొనుటకు ముందుకు సాగుతారు మరియు అతర్వాత ఎటువంటి తదుపరి క్లెయిమ్‌లు స్వీకరించబడవు మరియు అతర్వాత అన్ని క్లెయిమ్‌లు చెల్లనివిగా భావించబడును.

ఎస్.శశిధర్ రాజు మరియు మేకల శ్రీకాంత్, న్యాయవాదులు
ఆఫీ. ఫ్లాట్ నం.103, 1వ అంతస్తు, సిటీ సెంటర్ బిల్డింగ్, బాటా పైన, మార్గదర్శి కాలనీ, ఆర్.కె.పురం, హైదరాబాద్ -500102. ఫోన్: 7989204462, 9440597423

ప్రమాదవశాత్తు చెరువులో పడి కార్మికుడి మృతి



యాదయ్య మృతదేహం

షాబాద్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేశవగూడ గ్రామానికి చెందిన తోటమీది యాదయ్య(35) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం షాబాద్ పైల్వాహన్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి చేపల గాలం తీసుకుని బయటకు వెళ్లాడు. ఆయన చీకటి పడ్డా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు కంగారు పడ్డారు. తెలిసిన వారికి వాకబు చేసినా ఫలితం లభించలేదు. అయితే బుధవారం చెరువులో ఓ మృతదేహం పైకి తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి యాదయ్య మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం



రింకీ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నాబరంగాపూర్ జిల్లాకు చెందిన అశ్విన్ అతని భార్య రింకీ(24)తో కలిసి కొంతకాలంగా మండలంలోని బండరావిరాలలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో భర్త లేని సమయంలో రింకీ బయటకు వెళ్లింది. చీకటి పడినా తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం భర్త బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

అనంతగిరి: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ వలస కూలీ కాలు జారి కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో చేటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వడ్డె అశోక్(35) కొంతకాలంగా వికారాబాద్‌లోనే కుటుంబంతో ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుధవారం సైతం ఎన్నెపల్లిలో ఓ బిల్డింగ్‌లో 6వ అంతస్తులో పనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా కాలు జారి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన సదరు కూలీలు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబీకులు, కూలీలతో కలిసి మృతదేహంతో రాత్రి బిల్డింగ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. కాగా పలువురు సర్దిచెప్పడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వికారాబాద్ పోలీసులు తెలిపారు.

శ్రమ తక్కువ.. దిగుబడెక్కువ



పాలీహౌస్‌లో సాగు చేస్తున్న జెర్బరా సాగు



మార్కెట్‌కు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్న పూలు

- జెర్బరా సాగుతో లాభాలు బాగు
- పాలీహౌస్‌లో పూలసాగుకు మొగ్గు చూపుతున్న రైతులు

షాబాద్: పాలీహౌస్‌లో జెర్బరా సాగు లాభాలు కురిపిస్తున్నాయి. మూడు నెలలు కష్టపడితే ఆదాయం సమకూర్చుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవటమే కాదు.. పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారు. ప్రతిఒక్కరూ అలంకరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఉద్యాన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. మార్కెట్లో అలంకరణ పూలకు పెరుగుతున్న గిరాకీ రైతులను ఆలోచింపజేసింది. తక్కువ శ్రమతో అధిక లాభాలు రావడం గమనించి ఎక్కువ మంది పాలీహౌస్ సాగుకు మొగ్గు చూపుతున్నారు. షాబాద్ మండలంలోని ఎర్రోనిగూడ, నాగరగూడ, కక్కులూర్, హైతాబాద్, షాబాద్ తదితర గ్రామాల్లో రైతులు జెర్బరా పూల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లోకి వస్తున్న అలంకరణ పూలలో 90 శాతం బెంగళూరు, మహారాష్ట్ర, పూణే నుంచి దిగుమతి అవుతున్నాయి. డిమాండ్ ఉన్న పూలను ఇక్కడ ఎందుకు సాగు చేయకూడదనే ఆలోచనతో కొంత మంది రైతులు అలంకరణ పూలసాగు చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మండలంలో రైతులు పాలీహౌస్ విధానంలో జెర్బరా, కార్నేషన్, కట్‌ఫ్లవర్స్ పూల సాగు చేపడుతున్నారు.

ఒక్కసారి పెడితే ఐదేళ్ల వరకు..

ఎండ తీవ్రత, అధిక వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే పాలీహౌస్ విధానంతో పూల సాగు చేయవచ్చు. ఇందుకు ఖర్చు బాగానే అవుతుంది. రైతులకు ఎంతో లాభసాటిగా ఉంది. పాలీహౌస్ విధానంలో అలంకరణ పూల సాగు చేపట్టాలంటే ఎకరాకు రూ.యాభై లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఇది పెద్ద రైతులకే సాధ్యమనే అపోహ ఉంది. కానీ ప్రభుత్వం పాలీహౌస్ విధానంలో పూల సాగు చేపట్టే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. 50 శాతం రాయితీపై పాలీహౌస్ ఏర్పాటుకు కావాల్సిన పరికరాలు ఇస్తుంది. రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు వస్తున్నాయి.

రూ.40 వేలు మిగులుతుంది

పాలీహౌస్ ద్వారా పూలసాగులో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. రోజుకు ఎంతా లేదన్నా 500 వరకు పూలు వస్తాయి. సీజన్‌లో ఒక్క పువ్వు రూ.15 నుంచి రూ.20 వరకు ధర పలుకుతుంది. మిగతా రోజుల్లో రూ.10నుంచి రూ.12 వరకు ధర పలుకుతుంది. సీజన్ లేని సమయంలో వ్యాపారులు పూలను కొనుగోలు చేసి తమిళనాడు, చెన్నై తదితర ప్రాంతాలకు పంపిస్తున్నారు. పూల సాగు ద్వారా రోజుకు రూ.2వేలు నెలకు రూ.50వేలు వరకు ఆదాయం వస్తుంది. అందులో ఖర్చు రూ.10వేలు పోగా దాదాపు రూ.40 వేల వరకు రైతుకు ఆదాయం చేతికొస్తుంది.

ఎరువుల వినియోగం తక్కువ

ఇతర పంటలతో పోల్చితే వీటికి ఎరువుల వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది. పూల మొక్కలు నాటే ముందు 25 ట్రాక్టర్ల పశువుల ఎరువుకు రూ.20వేల వరకు ఖర్చు వస్తుంది. మొక్కలకు పోషక పదార్థాలు అందించే ఎరువులు వేసుకోవడానికి రూ. మూడు వేల వరకు ఖర్చు వస్తుంది. నాటిన వారం రోజుల తరువాత డ్రిప్ ద్వారా రసాయనిక ఎరువులు అందించాల్సి ఉంటుంది. ఈ విధమైన సాగుతో చీడపీడల, తెగుళ్ల బెడద ఉండదు. గాలి, వాతావరణం మార్పుల వల్ల నష్టం వచ్చే అవకాశం ఉండదు. కలుపు సమస్య అసలే ఉండదు.

మంచి డిమాండ్



పాలీహౌస్‌పై ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందజేసి రైతులను ప్రోత్సహించడం బాగుంది. నేను ఎకరం పొలంలో పాలీహౌస్ ద్వారా పూలసాగు చేపట్టాను. పెళ్లిళ్ల సీజన్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంటుంది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.30వేల వరకు ఆదాయం వస్తుంది.

– సామ ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రోనిగూడ

విధుల్లో అలసత్వంపై ఆగ్రహం



మినీట్యాంకు అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీపీఓ

షాద్‌నగర్‌రూరల్: గ్రామ పాలనలో పంచాయతీ అధికారి విధుల పట్ల అలసత్వం వహించడంపై డీపీఓ సురేశ్‌మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఏ) సురేశ్‌మోహన్, డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ జయంత్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, మినీట్యాంకులు, తడిచెత్త, పొడి చెత్త, భవన నిర్మాణం అనుమతులు, తాగునీటి పైపు లైన్‌లను పరిశీలించారు. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి తేజస్వినికి డీపీఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత మూడు నెలల నుంచి గ్రామపంచాయతీ సమావేశాలను నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధిలో అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

నిందితుడికి రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: తాళం వేసిన ఇంట్లో పక్కింటి యువకుడు చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయకుమార్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం కడియాలకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని బూరుగడ్డతండా చెందిన నేనావత్ లచ్చిరాం ఈ నెల 13న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో దసరా పండుగకు ఊరికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన పక్కింటి యువకుడు ముడావత్ మణిరాం తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలో దాచిన 50 తులాల వెండి కడియాలు, రూ.9,800 నగదును దోచుకెళ్లాడు. ఈ నెల 14న లచ్చిరాం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. డీఐ పీడీ.నాయుడు వివరాలు సేకరించి ముడావత్ మణిరాం చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. 50తులాల వెండి కడియాలు, రూ.9,800 నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ విజయకుమార్ తెలిపారు.

జీపీ నిధులను బ్యాంకుల్లో జమచేయాలి

డీపీఓ సురేశ్‌మోహన్



చేగూరు పంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్ మోహన్

కొత్తూరు: గ్రామ పంచాయతీల పరిధిలో అధికారులు, సిబ్బంది ఇళ్లు, పరిశ్రమలు, వ్యాపార సముదాయాల నుంచి వసూలు చేస్తున్న పన్ను రూపేణ వచ్చే నిధులను వెంటనే బ్యాంకుల్లో జమ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ సూచించారు. బుధవారం ఆయన నందిగామ మండల పరిధిలోని చేగూరు పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య, తాగునీటి పైపులైన్ల లీకేజీతో పాటు పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనులను, కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ.. పంచాయతీల పరిధిలోని సమస్యలను అధికారుల సూచనతో వెంటనే పరిష్కరించాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చే సమస్యలను కాలయాపన లేకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పాలక వర్గం, అధికారులు పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేస్తుండగా విషాదం

విద్యుదాఘాతంతో ఇరిగేషన్ ఉద్యోగి దుర్మరణం



ఇస్మాయిల్ (ఫైల్)

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువలో సర్వే చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ ఇరిగేషన్ ఉద్యోగి దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని నాగసమందర్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, ఇరిగేషన్ డీఈఈ భాస్కర్‌గౌడ్, గ్రామస్తుల వివరాల మేరకు.. కోట్‌పల్లి మండలం ఎన్నెపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(45) ఇరిగేషన్‌శాఖలో లస్కర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల పర్యవేక్షణ చూస్తుంటారు. ఆయన బుధవారం కోట్‌పల్లి కుడి, ఎడమ కాల్వలో సిబ్బందితో కలిసి ఆధునీకరణ కోసం సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పొడవైన అల్యూమినియం ఫ్రేంతో పని చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. అతనికి భార్య అలీమాబేగం, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'మల్టీపర్పస్' రద్దు చేయాలి

గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కొందుర్గు: మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొందుర్గు ఎంపీఓ లాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులను నియమించి మల్టీపర్పస్ విధానాన్ని అమలు చేసి వారితో వెట్టిచాకిరీ చేయించిందన్నారు. అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. జీపీ వర్కర్లకు వారంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులుగా దళిత, గిరిజనులు మాత్రమే పనిచేస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం పనులు నిర్వహించే వారికి అంటువ్యాధులు సోకకుండా బ్లౌజ్‌లు, బూట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, రాములు, సత్యనారాయణ, యాదమ్మ, రఫీ, సత్యయ్య, రత్నమ్మ, శేఖరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు ఐద్వా పోరాటం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



మహాసభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి

మీర్‌పేట: మహిళల హక్కుల సాధన, రక్షణ కోసం ఐద్వా నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నందిహిల్స్‌లో ఐద్వా జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మి మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే మహిళల హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. మహిళల రక్షణకు ముందున్నామని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం వివక్ష చూపుతూనే ఉన్నాయని ఆరోపించారు. పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న ప్రస్తుత సమాజంలో మహిళా శ్రమను చిన్నచూపు చూస్తూ హక్కులకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఐద్వా పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఐద్వా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి, అధ్యక్షురాలిగా కె.సుమలతతో పాటు మరో 12 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా ప్రజాతంత్ర బాధ్యులు కె.భాస్కర్, జగదీశ్, ప్రకాశ్‌కారత్, బాలాపూర్ మండల బాధ్యులు యాదయ్య విజయ, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



యాదగిరి (ఫైల్)

కేశంపేట: అత్తగారి ఇంటికి పండుగకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని సూరారం గ్రామానికి చెందిన యాదగిరి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివసిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా కుటుంబంతో కలిసి ఈనెల 12న అత్తగారి గ్రామమైన మండల పరిధిలోని దత్తాయపల్లికి వచ్చాడు. మరుసటి రోజు హైదరాబాద్‌కు వెళ్తున్నాని ఆయన కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదని అతడి భార్య శ్రీలక్ష్మి తెలిపింది. ఈ మేరకు ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై వచ్చి నగలు, నగదు దోపిడీ

ఇబ్రహీంపట్నం: మూత్ర విసర్జన చేసేందుకు కారు దిగిన వ్యక్తిని బెదిరించి దోపిడీకి పాల్పడిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన ముచ్చింతల నరేశ్ హయత్‌నగర్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. కొహెడ క్రాస్ రోడ్డు వద్ద మూత్ర విసర్జనకు కారు నిలిపి బయటకు దిగాడు. అంతలోనే అక్కడకు బైక్ వచ్చిన ఇద్దరు దుండగులు నరేశ్‌ను బెదిరించి రూ.18 వేల నగదు, మెడలోని తులం బంగారు గొలుసుతో ఉడాయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఓ టెక్నికల్ అసిస్టెంట్ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. మండలంలోని నాగసమందర్ చెందిన ఎం.కిరణ్‌కుమార్(38) ఉపాధి హామీలో పని చేస్తున్నాడు. మధ్యాహ్నం ఆయన మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LAND FOR SALE

■ శ్రీశైలం హైవే తలకండపల్లి మండలం, తలకండపల్లి గ్రామం, రంగారెడ్డి జిల్లా 8 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. ఫోన్ : 7416571239 [HA-16112]

PLOT FOR SALE

■ VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 99085 66079 [B-107]

Services

■ Finance కావలెను: నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం వద్ద 4 ఎకరాల 27 గుంటల వ్యవసాయ భూమిపై ఫైనాన్స్ కావలెను. ల్యాండ్ మార్టిగేజ్ చేయబడును. ✆ 83413 50089, 89786 45313 [B-4409]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [B00515]

BUSINESS OFFER

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796641]

■ ప్రతిరోజు రూ. 3000 - 50,000/- సంపాదించే సువర్ణావకాశం 100% నిజాయితీగా మనం సంపాదిస్తూ 10 మందికి ఉపాధి, ఇ బైక్ వ్యాపారం. ఫోన్: 9030769178 [SCA24000399]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Soumya N W/o Nallala Praveen Kumar, TRT 233, Near Vidyanagar Railway Station, Vidyanagar, Hyderabad, Telangana, Changed my Name as Soumya Nallala. [HA-05190]

■ I, Govind Rao S/o Madhav Rao, R/o. H.No 8-1-1/10/376/C, Mailardevpally, Rajendranagar, Rangareddy, Telangana. Changed my name to Govind Devne. [UA-48060]

■ I, Vadrevu Shanmukha Surya Prasad, R/o 201 Padmavathi Nilayam Apts,Tulasinagar, KPHB, Hyderabad, Telangana - 500072, correct my passport name from "Vadrevu Shanmukha Surya Prsad" to "Vadrevu Shanmukha Surya Prasad." [UA-48062]

OLD AGE HOME

■ సూర్యతేజ హోంకేర్ : వృద్ధులకు, పేషెంట్లు సేవకు, బేబికేర్, వంట/ఇంటి పనికి స్త్రీ/పు. కేర్ టేకర్స్ పంపగలము. 8309069400 [SCA24000396]

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783357]

Wanted

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024 [SCA24000401]

■ ప్రముఖ ఫర్నిచర్ కంపెనీ (Kukatpally) నందు పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను Q: Inter, Deg, Sal: 13K. 8341710841 [SCA24000404]

■ రియల్ ఎస్టేట్, రికవరీ, MLM, LIC, చిట్ ఫండ్ ఏజెంట్స్ స్త్రీ/పు పార్ట్‌టైం నెలకు 20,000/- నుండి 70,000/- వరకు సంపాదించుకోవచ్చును. ఫోన్: 9573277429 [HA-14829]

■ జైపూర్‌లో స్పెషల్ బిర్యానీ చేయడానికి అనుభవం గల నిపుణులు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. Contact: 9829057618 [H-14728]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ. పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185482]

■ Wanted Salesmen Cum marketing with exp in textiles,& Auto Drivers for delivery, Girls for Store Sales @ Sec-bad Ph: 9391644112 [HA-6089]

FACULTY TEACHERS

■ Wanted Telugu, English, Social, Phy & Bio Science, Hindi, Comp, 6-10th Class, English, Science,1st-5th. Nadergul, Kongarakalan. 8790190846, 8977683579 [HA-14727]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జిల్లాపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453